ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 26 అక్టోబరు 2025



విభేదాలకు తెర పడినట్టేనా!?

కాక రేపిన కాంగ్రెస్ అంతర్గత కలహాలు

- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ బహిరంగ క్షమాపణలతో లొల్లికి తెర
- చిచ్చు రేపిన మేడారం టెండర్లు, మాజీ ఓఎస్డీ సుమంత్ అరెస్టు యత్నాలు
- సీఎం, మంత్రులపై కొండా దంపతుల కుమార్తె వ్యాఖ్యలతో మరింత ఆజ్యం
- సయోధ్య నెరిపిన టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి
- ఓరుగల్లు ఎమ్మెల్యేలతో మాత్రం విభేదాలు కంటిన్యూ

వరంగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో సీఎం, మంత్రులతో కొండా దంపతులకు ఏర్పడిన విభేదాలు మంత్రి సురేఖ క్షమాపణలతో ఇక ముగిసినట్టేనా.. అనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఏర్పడిన విభేదాలపై రెండు రోజుల క్రితం కేబినెట్ మీటింగ్ అనంతరం మంత్రి సురేఖ వివరించారు. సీఎంకు క్షమాపణలు చెపుతున్నట్లుగా ప్రకటించారు. తమ కుమార్తె వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. దీంతో వివాదం ముగిసిందనే చర్చ నెలకొంది. అయితే సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితోపాటు పలువురిపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మేడారం టెండర్ల విషయంలో దేవాదాయశాఖకు సంబంధించిన రూ.101కోట్ల పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనకు తెలియకుండానే తన సొంత కంపెనీలకు కాంట్రాక్టులు ఇప్పించుకున్నారని సురేఖ.. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వివాదం చెలరేగటంతో మరుసటి రోజు మేడారం జాతర అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షకు సురేఖ లేకుండానే మంత్రులు పొంగులేటి, సీతక్కలు నిర్వహించారు.

దీంతో అగ్రహంగా ఉన్న మంత్రి కొండా సురేఖ.. అక్టోబరు 15న నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించేందుకు వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మేడారం జాతరకు సంబంధించి దేవాదాయ శాఖకు కేటాయించిన రూ.101కోట్ల పనులను రద్దు చేసి, ఆర్‌అండ్‌బీకి కేటాయించారు. దీనికి తోడు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ పదవిని ప్రభుత్వం తొలగించింది. వీటితో మనస్థాపంతో ఉన్న మంత్రి కొండా సురేఖ ఇంటికి మాజీ ఓఎస్డీ సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రావడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద పోలీసులతో మంత్రి కుమార్తె సుష్మితాపటేల్ వాగ్వాదానికి దిగటం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయటం రాష్ట్ర వ్యాప్తంగా సంచనలంగా మారింది.

ఈ వివాదం నేపథ్యంలో కేబినెట్ సమావేశానికి కొండా సురేఖ దూరంగా ఉండటం పలు ఊహాగానాలకు దారితీసింది. సీఎంతో మంత్రి సురేఖకు విభేదాలు ఏర్పడ్డాయనే చర్చ జరిగింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఓ నాయకుడు కొండా దంపతులను టార్గెట్ చేశారనే చర్చ జరిగింది. సీఎంకు సమాచారం లేకుండా సదరు నాయకుడు అధికారులకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేసి వివాదానికి కారణమయ్యారనే చర్చ కూడా జరిగింది. ఈ పరిణామల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌లో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి దీపావళి రోజున మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావులు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జరిగిన పరిస్థితులపై సీఎంకు కొండా దంపతులు వివరించారు. దీంతో సీఎంకు, కొండా దంపతులకు మధ్య ఉన్న విభేదాలు తొలిగిపోయాయనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అయితే అనూహ్యంగా గురువారం మంత్రి కొండా సురేఖ మీడియా ముందు సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో సమస్య సద్దుమణిగినట్టేననే చర్చ జరుగుతోంది. అయితే (మిగతా 8వ పేజీలో)



సిద్దార్థకాలనీలోని నాగేంద్రస్వామి ఆలయంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

శివాలయాల్లో విశేష పూజలు • పుట్టల్లో పాలు పోసిన మహిళలు

నిందితుడికి రిమాండ్

బయ్యారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరుకాని ఓ నిందితుడిని శనివారం పట్టుకొని జిల్లా కోర్టులో రిమాండ్ పరిచినంతరం జైలుకు తరలించినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గౌరారం గ్రామానికి చెదిన కందుకూరి వినోద్‌కుమార్‌పై నవంబరు 2024లో స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో అటెమ్ట్ మర్డర్ కేసు నమోదైంది. భార్య భార్గవిని వేధిస్తూ హతమార్చే ప్రయత్నం చేసిన కేసులో ఆయనపై గృహహింస, హత్యాప్రయత్నం కేసులు నమోదైయ్యాయి. రిమాండ్ అనంతరం కొంత కాలానికి బెయిల్‌పై బయటకు వచ్చిన వినోద్‌కుమార్ కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో జడ్జి రఫి జారీ చేసిన నాన్ బెయిల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ)లో భాగంగా శనివారం వినోద్‌కుమార్‌ను పట్టుకొని కోర్టులో రిమాండ్ పరిచినంతరం సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ శనివారం జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ తీర్పు వెల్లడించినట్లు కోర్టు కానిస్టేబుల్ నరేందర్ తెలిపారు. కేసముద్రంకు చెందిన కర్ర సోమిరెడ్డి 2024 డిసెంబరు 24న నారాయణపురానికి చెందిన అశోక్‌కు కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 9.40 లక్షలను అప్పుగా ఇచ్చాడని, అశోక్ 15 రోజుల్లో చెల్లిస్తానని చెప్పి సోమిరెడ్డికి చెక్కును ఇచ్చినట్లు చెప్పాడు. అనంతరం డబ్బులు చెల్లించకపోవడంతో సోమిరెడ్డికి ఇచ్చిన చెక్‌ను బ్యాంకులో వేయగా, అందులో డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు కేసు పూర్వాపరాలను పరిశీలించిన కృష్ణతేజ్ తీర్పును వెల్లడించారు. సోమిరెడ్డికి 30 రోజుల్లో అశోక్ రూ.10లక్షలు చెల్లించని పక్షంలో అతడికి సంవత్సరం పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు జడ్జి తీర్పు వెల్లిడించినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు చర్యలు

- రైతులకు వసతులు కల్పించాలి
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రెవెన్యూ, పౌరసరఫరాలు, సహకార, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన వరి కోతల వివరాలను తెలుసుకుని అందుకనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 242 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వార రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించేందుకు పక్కా ప్రణాళికలతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలును విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్థానిక తహసీల్దార్‌లు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించాలన్నారు. వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. సన్న, దొడ్డు ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో పురుషోత్తం

తొర్రూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం మహబూబాబాద్ జడ్పీ సీఈవో డి.పురుషోత్తం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ, ఇందిరమ్మ ఇళ్ల పనులపై సమీక్షించి మాట్లాడారు. కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని, కూలీ డబ్బులు అందేల చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు, ఎంపీవో పూర్ణచందర్, ఎంఈవో బుచ్చయ్య, కార్యాలయం సిబ్బంది కిరణ్, వినయ్‌కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

మరిపెడ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూక్యా తండా జీపీలో పరిధిలోని బోడ తండాలో బోడ ద్వాలీ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృత దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ సేవియానాయక్, యమ్డీ ఆయూబ్‌పాషా, రెడ్యా, భాషా, ధర్మ, శంకర్, పాపా, వీరన్న తదితరులు ఉన్నారు.

ఆందోళనలు వద్దు.. అర్హులను ఎంపిక చేస్తాం

● తొర్రూరు ఆర్డీవో గణేష్



డబుల్ బెడ్రూం వద్ద ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఆర్డీవో గణేష్

తొర్రూరురూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఎలాంటి ఆందోళనలు వద్దని, అర్హులై ప్రతి ఒక్కరిని ఎంపిక చేస్తామని తొర్రూరు ఆర్డీవో జి.గణేష్ అన్నారు. గత ఆరు నెలలుగా సీపీఎం ఆధ్వర్యంలో 300 మంది ఆందోళన చేస్తూ దసరా రోజున గృహ ప్రవేశం చేశారు. సంఘటన స్థలానికి ఆర్డీవో గణేష్ చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆందోళన విరమించి ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను ప్రజలకు అందజేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం దిగివచ్చేంతవరకు ఆందోళనతో అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి ఇళ్లను పంపిణీ చేసే వరకు దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ టి.గణేష్, తహసీల్దార్ గడీల శ్రీనివాస్, డీటీ నర్సయ్య, ఎస్సై ఉపేందర్, సీపీఎం జిల్లా నాయకులు గునిగంటి రాజన్న, బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, పట్టణ కార్యదర్శి యాకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు



మాట్లాడుతున్న మరిపెడ ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లమ్మ

మరిపెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని మరిపెడ ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లమ్మ హెచ్చరించారు. శనివారం మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు చెందిన సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సీడీపీవో మరిపెడ ఆడిటోరియం కం ఇండోర్‌స్టేడియంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు టైమ్ మెయింటెన్ చేస్తూ చిన్నపిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే పోషకాహారం పంపిణీ సక్రమంగా ఉండాలన్నారు. లోగ్రోత్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏసీడీపీవో తేజకల్యాణి, వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నగూడూరుకు బ్యాంక్, సబ్ పోస్టాఫీసు మంజూరు చేయాలి

● ఎస్టీ జాతీయ కమిషన్ మెంబర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చిన రాంరెడ్డి



హుస్సేన్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న రాంరెడ్డి

చిన్నగూడూరు (మరిపెడ), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటైనా చిన్నగూడూరు మండల కేంద్రానికి ఏదైనా వాణిజ్య బ్యాంక్, సబ్ పోస్టాఫీసు మంజూరి కోసం సహాయం చేయాలని కోరుతూ మరిపెడ పీఏసీఎస్ మాజీ చైర్మన్, చిన్నగూడూరు మాజీ సర్పంచ్ రావుల రాంరెడ్డి జాతీయ ఎస్టీ కమీషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్‌ను శనివారం మహబూబాబాద్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాంరెడ్డి ఆయనతో మాట్లాడారు. చిన్నగూడూరు ప్రజలు బ్యాంక్ సౌకర్యం లేకపోవడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందని వివరించారు. అదే విధంగా మండల కేంద్రంగా చిన్నగూడూరు ఏర్పాటై 10ఏళ్లు కావొస్తున్నా సబ్ పోస్టాఫీసు లేదన్నారు. దీంతో హుస్సేన్‌నాయక్ సైతం సానుకూలంగా స్పందించినట్లు రాంరెడ్డి స్థానిక విలేకరుల కు తెలిపారు. అదేవిధంగా అక్కడి బీజేపీ నేతలు మాచెర్ల నవీన్, వేణు, లక్ష్మణ్ తదితరులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం హుస్సేన్‌నాయక్‌కు అందచేశారు.

అభాగ్యులకు అసరాగా నిలుస్తున్న జన వికాస



అనాథ వృద్ధులకు నిత్యావసర సరకులు అందచేస్తున్న జిల్లా కాంగ్రెస్ నేతలు యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మరిపెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అభాగ్యులకు మరిపెడ జన వికాస ఎంతో అసరాగా నిలుస్తుందని జిల్లా కాంగ్రెస్ నేతలు వంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జనవికాస సంస్థ స్థానిక బాలవికాస భవన్‌లో మరిపెడ మండలంలోని 30మంది అనాథ వృద్ధులను గుర్తించి వారికి ఉచితంగా నిత్యావసర సరకులు, బెడ్‌షీట్లు, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి బాల వికాస, జనవికాస అనాథ వృద్ధులను, పిల్లలను గుర్తించి వారిని చేరదీసి చేదోడు వాదోడుగా ఉంటుందని గుర్తు చేశారు. సంస్థ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్, స్థానిక సూర్య ఏజెన్సీ నిర్వాహకులు వుప్పల కృష్ణమూర్తి-మహాలక్ష్మీ, వుప్పల నాగేశ్వర్‌రావు-మధులత, సత్యం-కృష్ణ-వేణి దంపతులు, కాంగ్రెస్ నాయకులు కొండం దశరథం, రాయల రవి-ఉష, జనవికాస బాధ్యులు గంధసిరి ఉపేంద్ర, జుజ్జూరి ఉపేంద్ర, కవిత, గ్రామ బాధ్యులు నీల, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఈఏ శిక్షణ పూర్తి చేసిన డిసౌజా



అమెరికా ప్రతినిధి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న డిసౌజా

మరిపెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మోడల్ స్కూల్ ఇంగ్లీష్ బోధకుడు సోన్‌బోన్ అంథని డిసౌజా అమెరికా ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అండ్ అచీవ్‌మెంట్ (ఎఫ్‌టీఈఏ) శిక్షణకు ఎంపికై అమెరికా నార్త్ కరోలైనా యూనివర్శిటీ, గ్రీన్‌స్బోరోలో దిగ్విజయంగా ఆ శిక్షణను శనివారంతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ఆయనకు ఆ శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లను అందచేశారు. ఈ శిక్షణకు భారతదేశం నుంచి డిసౌజాతో పాటు మరో ఆరుగురు ఎంపికయ్యారు. ఈయన ఎంపిక తెలంగాణ విద్యావ్యవస్థకే వన్నెతెచ్చిందని ఆ స్కూల్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తూ డిసౌజాను ప్రశంసలతో ముంచెత్తున్నారు. సెప్టెంబరు 10 నుంచి అక్టోబరు 25 వరకు ఆరు వారాల పాటు అకాడమిక్ శిక్షణ పొంది, 40 గంటలు ఫీల్డ్ అనుభవం, మరో 40 గంటలు సివిక్స్, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించడంతో అత్యంత ప్రతిభకనబరిచి డిసౌజా ఔరా అనిపించారు. అక్కడి విద్యావ్యవస్థ ప్రతినిధులు ఆయనను అభినందించారు. దీంతో ఆ స్కూల్ ప్రిన్సిపాల్ సత్తార్‌పాషాతో పాటు ఆధ్యాపకులు, సహచర టీచర్లు, విద్యార్థులు మురిసిపోతున్నారు.

'పేద విద్యార్థులను ఆదుకోవాలి'

కురవి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు చేయూతనందించాలని స్ఫూర్తి ఎడ్యుకేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ సహాయం శ్రీధర్‌రెడ్డి అన్నారు. సీరోలు మండలం చింతపల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో తెలుగు సమితి ఆఫ్ మెట్రోప్లెక్స్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు నాగరాణి, సత్తార్, వజ్ర కుమారి, రవీందర్, జ్యోతి, మాధవ్, చిన్నం ప్రదీప్ పాల్గొన్నారు.

'బాలికకు వైద్యం అందించాలి'

గార్ల అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అస్వస్థకు గురైన బాలికకు ప్రభుత్వం వైద్య సదుపాయం అందించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు తాళ్లపల్లి కృష్ణాగౌడ్ అన్నారు. శనివారం హాస్టల్‌లో ఉంటూ కళ్లు తిరిగి పడిపోయిన 10వ తరగతి విద్యార్థిని తేజావత్ హారికను సిబ్బంది సరైన వైద్య అందించాలన్నారు. బాలిక విషయంపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు, కలెక్టర్ గారి దృష్టికి తీసుకపోతానని ఆయన తెలిపారు.

'డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి'

కొత్తగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై సదానందం సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడలోని గిరిజన సంక్షేమ శాఖ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో శనివారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆలూరి కృష్ణ, ఇన్‌చార్జి హెచ్ఎం సుబ్బారావు, సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు వాసం వీరస్వామి, కానిస్టేబుల్ సుకేందర్, ఉపాధ్యాయులు రాజమ్మ, వెంకటయ్య, రేగ పాపయ్య, శ్రీనివాసులు, విజయలక్ష్మీ, పీఈటీ దేవేందర్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

గార్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల హక్కుల కోసం భవిష్యత్‌లో పోరాటాలు చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి రాములు పిలుపునిచ్చారు. శనివారం గార్లలో జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల 5వ రాష్ట్ర మహాసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సభలో కార్మికుల ప్రయోజనాల కోసం పలు తీర్మాణా లు ఆమోదించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి చాంగటి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, బండ్ల అప్పిరెడ్డి, పడమర్తి దాసు, దస్తగిరి, సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, కందునూరి శ్రీనివాస్, వంగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న వంగూరి రాములు

గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



బయ్యారంలో మాట్లాడుతున్న కోరం కనకయ్య

బయ్యారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. బయ్యారం రైతు వేదికలో శనివారం పోషణ్ మాసం ఉత్సవాలు జరిగాయి. అందులో భాగంగా పలువురికి సామూహిక శ్రీమంతం నిర్వహించి, చిన్నపిల్లలకు అక్షరభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించాలన్నారు. విధిగా గుడ్లు, పాలు పంపిణీ చేయాలని సూచించారు. బాలింతలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, సీడీపీవో శిరీష, ఏసీడీపీవో అఖిలతో పాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

కందికొండ జాతరను విజయవంతం చేద్దాం



కందికొండలో సమావేశమైన గ్రామస్థులు

కురవి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కందికొండలో నవంబర్ 5న జరుగనున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి, వేంకటేశ్వరస్వామి జాతరను విజయవంతం చేయాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మాణించారు. జాతర ఏర్పాట్ల కోసం శనివారం గ్రామపంచాయతీలో సమావేశమై కులాల వారీగా కమిటీలు వేసుకున్నారు. జాతర కోసం మొదటి నుంచి జంగాల కుటుంబీకులు దేవుడి అన్నప్రసాదాలు, అభివృద్ధి, మిగతా ఖర్చు భరిస్తున్నారని, ఈ సారి సైతం ఆలయ సంబంధిత ఖర్చులు తామే భరిస్తామని గ్రామస్థుల సమక్షంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుడి ప్రధాన అర్చకులు పురుషోత్తమాచార్యులు, జంగాల భాస్కర్, నర్సింహారావు, విజయ్, ఉపేందర్, మంగపతి రావు పాల్గొన్నారు.

పెన్షనర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్



సీరోలులో మాట్లాడుతున్న రమేష్

కురవి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. సీరోలు పాఠశాలలో శనివారం జరిగిన టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఏటా రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నారని, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అందడం లేదన్నారు. దీంతో వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక అనేక మంది మృతి చెందారన్నారు. బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్.విద్యాసాగర్, కార్యదర్శి సింగం మనోహర్, రహీముద్దీన్, పొద్దుటూరి రమేష్, కర్నావత్ వీరన్న, ప్రతాపని సత్యనారాయణ, మక్కల బిక్షం, ముంతాజ్‌బేగం, అమితాబచ్చన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా..



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య అన్నారు. కొత్తగూడ మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు శనివారం వారు ఆర్థిక సహాయం చేశారు. కర్లెగండి గ్రామానికి చెందిన బంగారి వెంకటయ్య కుటుంబానికి రూ.10 వేలు, క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బానోత్ రూప్‌సింగ్, సుంకరబోయిన మొగిలి, కాడబోయిన జంపయ్య, ఇర్ప రాజేశ్వర్, కాయితోజు ఉపేంద్రాచారి పాల్గొన్నారు. అదేవిధంగా వేలుబెల్లికి చెందిన కొండ లచ్చమ్మ కుటుంబానికి మాజీ సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మీ సురేందర్ ఆర్థిక సహాయం చేశారు. ఆమె వెంట అల్లాడి రాజు, నాయకులు కాట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయికుమార్

కొత్తగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయికుమార్, కోశాధికారి గుగులోత్ సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాజ్యోతుల పథకం కింది ఎస్టీ విద్యార్థులకు తరగతుల వారిగా ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రతీ మండలంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దేవేందర్, నవీన్, విష్ణు, సుధీర్, సునిల్, భరత్, లోకేష్, దీపక్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సాంకేతిక సృజన

- 50కి పైగా ఈవెంట్లతో సందడిగా సాగిన సాంకేతికోత్సవం
- చివరి రోజూ కొనసాగిన ఈవెంట్లు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం
- నిట్‌లో ముగిసిన టెక్నోజియాన్

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో రెండు రోజుల పాటు వైభవంగా జరిగిన టెక్నోజియాన్-2025 (సాంకేతికోత్సవం) శనివారం ముగిసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్ఐటీల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు టెక్నోజియాన్‌లో పాల్గొన్నారు. వరంగల్ నిట్‌లోని 7వేల మందికిపైగా విద్యార్థులు కూడా వీరితో కలిసి వివిధ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీలు, పలు విభాగాల ఆధ్వర్యంలో 50కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. ప్రతీ ఈవెంట్ ప్రత్యేకతను చాటాయి. వీటిలో చాలా వరకు కొత్తవి. సరికొత్త ఆవిష్కరణలు. వినోదాన్ని పంచే ఫన్నీ ఈవెంట్లు కొన్ని కాగా, వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచే ఈవెంట్లు మరికొన్ని. అన్నింటిలోనూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. వీరికి టెక్నోజియాన్ ముగింపు సందర్భంగా రూ.2.60 లక్షల నగదు పురస్కారాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. శనివారం రెండో రోజు కూడా వివిధ ఈవెంట్లు పోటాపోటీగా సాగాయి. నిట్ అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు టెక్నోజియాన్‌లో నిర్వహించిన ఈవెంట్లు, ప్రదర్శించిన ఎగ్జిబిట్లను స్వయంగా పరిశీలించి వాటి ప్రత్యేకతలను రికార్డుచేశారు. భవిష్యత్‌లో ఈ సమాచారం ప్రయోగాల కొనసాగింపునకు దోహదపడుతుందని ఈవెంట్ టీమ్‌లీడర్లు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల హల్‌చల్

టెక్నోజియాన్‌లో చిన్నారులు హల్‌చల్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము స్వయంగా రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. టెక్నోజియాన్ ద్వారా సాంకేతిక కళాశాలలో చదివే విద్యార్థులనే కాకుండా చిన్నారులను కూడా ప్రోత్సహించే లక్ష్యంతో వారికీ ఇందులో అవకాశంకల్పించారు. సైన్స్‌పట్ల వారిలో జిజ్ఞాస పెంపొందించే ఉద్దేశంతో వారి ఎగ్జిబిట్ల ప్రదర్శనకు అవకాశం కల్పించారు. టెక్నోజియాన్‌కు హాజరైన ఇతర రాష్ట్రాల నిటియన్లు ఈ ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. 40కిపైగా ఎగ్జిబిట్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పిల్లలంతా 5 నుంచి 10 ఏళ్లలోపువారే. అర్జున్ సాయి అనే ఐదేళ్ల యూకేజీ విద్యార్థి ప్రదర్శించిన మెటల్ డిటెక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా లోహాలను ఎలా కనిపెట్టవచ్చో దీని ద్వారా చూపించాడు. మరో విద్యార్థి మూగవాళ్ల కోసం యూసింగ్ ఫ్లెక్సనర్ ఫర్ సింబాలింగ్ అనే పరికరాన్ని రూపొందించాడు. మూగవాళ్లు దీనిని ద్వారా సంకేతాలు పంపి తమకు కావలసింది తెలియచేయవచ్చు. మరో విద్యార్థి వీల్‌చైర్‌ను రిమోట్ ద్వారా నడిపే పరికరాన్ని తయారు చేశాడు.



● కిట్ అసెంబ్లీ

టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కిట్ అసెంబ్లీ విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగాపాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న వారికి కార్లు, మోటారు సైకిళ్లు, వివిధ వస్తువులకు సంబంధించిన విడిభాగాలను ఇస్తారు. ఒక బాక్స్‌లో ఒకటి నుంచి ఆరు వస్తువులు విడి భాగాలు ఉంటాయి. పోటీలో పాల్గొనేవారు వీటిలో ఏదైనా ఒక వస్తువు విడిభాగాలను 40 నుంచి 60 నిమిషాల్లో కలిపి దాని వాస్తవ రూపాన్ని తీసుకురావాలి. ఇలా నిర్ణీత సమయంలో ఒక కిట్‌లోని విడి భాగాలను కలపగలిగిన వారినే విజేతలుగా పరిగణిస్తారు.



● బ్లేజ్

ఇది ఒక ఫన్నీ ఈవెంట్. లేజర్ బుల్లెట్ల ద్వారా ఎదుటి వ్యక్తిని శక్తిహీనుడిని చేయడం ఈవెంట్ ప్రత్యేకత. ఇందులో ఇద్దరు ప్రత్యర్థులు ఉంటారు. వారి చేతిలో రెండు లేజర్ గన్లు ఉంటాయి. ప్రత్యేకంగా రూపొందించిన బ్లేజర్‌ను ధరించి పోటీలో పాల్గొనాలి. ఈ బ్లేజర్‌పై రిసీవర్ ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు తమ లేజర్ గన్‌ల ద్వారా దానిపై సరిగ్గా గురిపెట్టి పరస్పరం షూట్ చేసుకుంటే లేజర్ బుల్లెట్ ఎవరికి తగులుతుందో ఆ ప్రత్యర్థి శక్తి విహీనమవుతాడు. అలా ఎవరైతే ముందుగా తన ప్రత్యర్థిని శక్తివిహీనుడిని చేస్తారో వారు విజేత. వరంగల్ నిట్ రోబోటిక్ ల్యాబ్ దీనిని రూపొందించింది.



● ఫొటో డిజైన్

టెక్నోజియాన్‌లో భాగంగా ఫొటో డిజైనర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సాంకేతిక ఉత్సవంలో పాల్గొనే విద్యార్థులు తీపి గుర్తుగా ఇక్కడ నిలబడి ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అందమైన ఫ్రేమ్‌ను రూపొందించారు. ఆ ఫ్రేమ్ మధ్యలో నిలబడడం ద్వారా దిగే ఫొటోలు కళాత్మకంగా కనిపిస్తున్నాయి.



● ఆప్టి మిస్ట్రీ

ఇది కూడా ప్రత్యేక ఈవెంటే. ఒక మిస్టరీని ఛేదించడానికి మనం సృజనాత్మకతను వాడుతాం. ఈ ఈవెంట్‌లో సృజనాత్మకతకు విద్యుత్‌ను కూడా జోడిస్తే.. ఇదో కొత్త భావన. నిట్‌లోని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు దీనిని రూపొందించారు. కొన్ని లాజికల్ ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లో కొన్ని నెంబర్లు ఉంటాయి. ఈ నెంబర్ల సహాయంతో విద్యార్థులు తమ సృజనాత్మతను జోడించి కొన్ని కోడ్స్ పంపడం ద్వారా మిస్టరీని ఛేదిస్తారు. మిస్టరీని ఛేధించడంలో మనుషులతో పాటు విద్యుత్ సహాయం తీసుకోవచ్చునని దీనిని బట్టి తెలుసుకోవచ్చు.



● నో బగ్స్ గివెన్

ఇది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పరీక్ష పెట్టే ఈవెంట్. ఈవెంట్‌లో ఐదు నుంచి ఆరు రౌండ్లు ఉంటాయి. ఒక ప్రాజెక్టులోని బగ్స్(ఎర్రర్స్)ను కోడింగ్ ద్వారా ఎంత వేగంగా చేయగలిగితే అంత ర్యాంక్ వస్తుంది. కోడింగ్ మొదట పూర్తి చేసిన వారు ఒక రౌండ్ నుంచి ఇంకో రౌండ్‌కు వెళతుంటారు. మొత్తం ఆరు రౌండ్లు ఉంటాయి. ఇందులో మొదటి మూడు రౌండ్లు ఎవరు ముందు చేస్తే వారే విజేతలు. ఈ పోటీలో సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.



● మోషన్ క్యాప్చర్ వర్క్‌షాప్

ఈ వర్క్‌షాప్ టెక్నోజియాన్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. స్క్రీన్‌పై పదికి పైగా కార్టూన్ పాత్రలు ఉంటాయి. అందులో ఏదైనా ఒక దానిని ఎంచుకోవాలి. ఎదురుగా కెమెరా ఉంటుంది. దానిముందు నిల్చొని మనం ఎలా నటిస్తే స్క్రీన్‌పై మనం ఎంచుకున్న కార్టూన్ అలా కదులుతుంది. దీనిని రికార్డు చేస్తే కార్టూన్ ఫిల్మ్ అవుతుంది.

క్రమశిక్షణ, నిబద్ధతతోనే విజయం

- జీవితంలో స్వీయ కృషి ఎంతో ముఖ్యం
- గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి
- రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ బాలలత
- వరంగల్ నిట్‌లో ప్రేరణాత్మక ప్రసంగం

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టి ద్వారా ఎలాంటి సవాళ్లయినా అధిగమించి విజయాన్ని సాధించవచ్చునని రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, సివిల్ పరీక్షల శిక్షకురాలు, మోటివేటర్ మల్లవరపు బాలలత అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025లో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ.. జీవితంలోని ప్రతీ దశలో నిరంతర కృషి, స్వీయ విశ్వాసం ముఖ్యమన్నారు. విద్యార్థులు ఇష్టమైన వృత్తిని ఎంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ క్రమబద్ధమైన పని విధానం గురించి బాలలత ఆసక్తిగా వివరించారు. ఆయన చిన్న విరామాలతో క్రమ శిక్షణతో కూడిన పనిసమయాలను పాటిస్తారని చెప్పారు. అలాగే రతన్‌టాటా స్వభావం, వినయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించిన వ్యక్తుల జీవితాల నుంచి ప్రేరణ పొందాలని, వారి ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. మొబైల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. విజయవంతమైన వ్యక్తులు తమ సమయాన్ని, ఆలోచనను సమాజాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వినియోగిస్తారని అన్నారు. నియమబద్ధమైన జీవనం, విశ్లేషణాత్మకమైన ఆలోచనలు, నిరంతర అధ్యయనం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస వంటి మంచి అలవాట్లు విజయానికి సోపానాలని అన్నారు. అనంతరంవిద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలుఇచ్చారు. తన జీవిత ప్రయాణాన్ని సంక్షిప్తంగా వివరించారు.



మాట్లాడుతున్న బాలలత



● సుమో వార్

ఇది కూడా ఒక ఫన్నీ ఈవెంట్. సుమోల మల్ల యుద్ధం లాంటిది. వాస్తవంగా అయితే బరిలో మల్ల యుద్ధం సుమోలు చేస్తారు. కానీ, ఈ ఈవెంట్‌లో సుమోలకు బదులు చెక్కతో ప్రత్యేకంగా రూపొందించి చతురస్రాకారపు బాక్స్, దానిపై అమర్చిన ఇనుప ఈటె, బాక్స్‌పై బెలూనే సుమో వీరుడు. రింగ్‌లో మొత్తం నాలుగు ఉంటాయి. రింగ్‌ను అనుకొని డేంజర్ జోన్ ఉంటుంది. రిమోట్ సాయంతో ఈ బాక్స్‌లను ఒకదానికి ఒకటి ఢీకొట్టడం ద్వారా ప్రత్యర్థి బాక్స్‌ను రింగ్ బయటకు డేంజర్ జోన్‌లోకి పంపినవారే విజేత. బయటకు పంపలేకపోయినా బాక్స్‌పై ఉన్న ఈటెతో ఎదుటి బాక్స్‌పై ఉన్న బెలూన్ అయిన పగులగొట్టగలిగినా గెలిచినట్టే.



● మర్డర్ మిస్టరీ

టెక్నోజియాన్‌లో ఎక్కువగా ఆకట్టుకున్న ఈవెంట్ మర్డర్ మిస్టరీ. ఫన్నీగా, ఎగ్జైటింగ్‌గా ఉన్న ఈ ఈవెంట్ విద్యార్థుల తెలివి తేటలకు పరీక్ష పెట్టింది. ఓ హత్య కేసును ఛేదించే క్రమంలో కృత్రిమ మేధ చాట్‌బాట్స్‌ను ఉపయోగించి అనుమానితులుగా పేర్కొన్న వారి ప్రవర్తనను నిశితంగా బేరీజు వేసుకుంటూ హత్యోదంతానికి రూపకల్పనచేసి తద్వారా ఈ అనుమానితుల్లోని అసలైన హంతకుడిని గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. ఇందుకు 40 నిమిషాల వ్యవధిఉంటుంది. ఆలోగా ఏటీమ్ గుర్తిస్తే అదే విజేత. ఇంకో టీమ్‌లో ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు ఉంటారు.



మూగ వారి కోసం తయారు చేసిన సెన్సార్ పరికరం



చిన్నారి రూపొందించిన మెటల్ డిటెక్టర్



లైట్ పెయింటింగ్‌పై వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న విషయ నిపుణుడు



చిన్నారుల ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న సందర్శకులు

సీజేఐపై దాడి న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై దాడి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సీజేఐ)పై ఒక లాయర్ బూటుతో దాడి చేసిన సంఘటన న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై, దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అభివర్ణించారు. దళితుడైన గవాయ్‌పై దాడి జరిగితే దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ వ్యవస్థలన్నీ ఎందుకు మౌనంగా ఉంటున్నాయనే ప్రశ్నకు ఇంత వరకు జవాబు దొరకడం లేదన్నారు. శనివారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. దేశంలో న్యాయ వ్యవస్థకు అధిపతి అయిన చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగితే ఎలాంటి చర్యలు చేపట్టక పోవడానికి కారణాలేంటో అర్థం కావడం లేదన్నారు. దాడి జరిగాక దేశ ప్రధాని నరేంద్రమోదీ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ దాడిని దేశం యావత్తు ఖండిస్తోందని, ఈ సంఘటన ప్రతీ భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని, ఇది న్యాయ వ్యవస్థపై దుర్మార్గమైన చర్య అని అన్నారని మంద కృష్ణమాదిగ తెలిపారు. దేశ ప్రతిపక్ష నేతలైన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సంఘటనను రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఖండించారని అన్నారు. అంతేగాక సిద్ధాంతాలు ఏమైనప్పటికీ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, వామపక్షాలతో సహా సంఘటనను ఖండించాయని ఇంకా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు ఎందుకు చేయడం లేదని డిమాండ్ చేయకుండా ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున ఖర్గే దళితుడైనప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారో జవాబు చెప్పాలని అన్నారు. సంఘటనపై మానవ హక్కుల కమిషన్ ఎందుకు స్పందించడం లేదన్నారు. సంఘటనను మేధావులతో సహా అన్ని వ్యవస్థలు ఖండించినా ఎందుకు నిరసన తెలపడం లేదని అన్నారు. దళిత పార్టీలకు న్యాయకత్వం వహిస్తున్న పార్టీలు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నాయని అన్నారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవం పేరుతో లక్షలాది మందితో నవంబరు 1న నిరసన ప్రదర్శనకు పూనుకుంటున్నట్లు మంద కృష్ణ మాదిగ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా న్యాయ వ్యవస్థపై గౌరవం ఉన్న రాజకీయ పార్టీలన్నీ నిరసన ప్రదర్శనలో పాల్గొనాల్సిందిగా మంద కృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సుకుమార్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకులు చాతాళ్ల శివ మాదిగ, మాదిగ యువసేన నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్స్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

- దుబారా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు
- పీజీ కొత్త విద్యార్థులకు హాస్టల్స్ అడ్మిషన్లు
- కొత్త విద్యార్థులతో కేయూలో సందడి





హాస్టల్ అడ్మిషన్ పత్రాలను ఇస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కొత్త విద్యార్థులతో కేయూ హాస్టల్ ఆఫీస్ వద్ద సందడి

కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో కొత్త విద్యార్థులతో సందడి నెలకొంది. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర కోర్సుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. అక్టోబరు 24 నుంచి ఫిబ్రవరి 19 వరకు పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ అల్మానాక్ విడుదల చేయడంతో విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టళ్లలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నుంచి హాస్టల్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ నేతృత్వంలో రూపొందించారు. విద్యార్థుల సమగ్ర వివరాలన్నీ కేయూ హాస్టల్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. హాస్టల్స్ డిపాజిట్‌ను చెల్లించగానే అడ్మిషన్ ఫామ్ జనరేట్ అవుతుంది. అడ్మిషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత విభాగాధిపతితో సంతకం చేయించి వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో అందచేయగానే రూమ్‌తోపాటు మెస్‌కార్డు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ వెల్లడించారు.

కేయూ హాస్టల్ వెబ్‌సైట్ ఇదే..

కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర ఏదైనా రెగ్యులర్‌లతో పాటు కొన్ని ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వర్సిటీలో వారి కోర్సు కాలపరిమితి మేరకు హాస్టల్‌తోపాటు మెస్ సౌకర్యాలు కల్పిస్తారు. హాస్టల్ వసతి కోసం కేయూ కాలేజేస్.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అకడమిక్ ఇయర్, కోర్సు టైప్, కోర్సు, కోర్సు ఇయర్, సెమిస్టర్, కాలేజీ, హాల్‌టికెట్ నెంబరు, స్టూడెంట్, తండ్రి, తల్లి పేరుతో పాటు పాటు పుట్టిన తేదీ, సామాజిక వర్గం, అడ్రస్, డిపాజిట్ వివరాలతో పాటు ఫొటో నమోదు చేయాలి. తర్వాత హాస్టల్ ఫామ్ జనరేట్ అయిన తర్వాత డౌన్‌లోడ్ చేసుకుని మెస్, హాస్టల్స్ సౌకర్యాలు పొందాలి. వెబ్‌సైట్ అడ్రస్ https://kucolleges.co.in/hostels/newad-mission వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ వెల్లడించారు.

హాస్టల్స్ ఫీజుల వివరాలు ఇవే..

కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సామాజిక వర్గాల వారీగా హాస్టల్స్ డిపాజిట్లను నిర్ణయించారు. ఓసీ కేటగిరి అభ్యర్థులు రూ.12,200, బీసీ కేటగిరి అభ్యర్థులు రూ.10,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.8,200 చెల్లించాలి. అన్ని కేటగిరీలకు చెందిన దివ్యాంగులు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని డైరెక్టర్ తెలిపారు.

కావాల్సిన ధృవపత్రాలివే..

హాస్టల్స్‌లో అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులకు కాలేజీ అలాట్‌మెంట్ ఫామ్, హాస్టల్ అడ్మిషన్ రశీదు, ప్రిన్సిపాల్ ఆఫీస్ అడ్మిషన్ రశీదు, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, కుల ధ్రువపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి.

మహిళలకు పద్మాక్షి.. పురుషులకు న్యూపీజీ హాస్టల్..

నూతనంగా కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తారు. మహిళా అభ్యర్థులకు క్యాంపస్‌లోని పద్మాక్షి లేడీస్ హాస్టల్, అలాగే పురుషులకు న్యూపీజీ హాస్టల్‌లో గదులు కేటాయిస్తారు. ఇతర వివరాలకు క్యాంపస్‌లోని హాస్టల్ ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ హాస్టల్స్, మెస్ సౌకర్యాలు అప్పటికప్పుడు అందిస్తామన్నారు.

కొత్త విద్యార్థులతో క్యాంపస్ కళకళ

అక్టోబరు 24 నుంచి పీజీ కోర్సుల సెమిస్టర్ తరగతులు షురువు కావడంతో విద్యార్థులు క్యాంపస్‌కు తరలివచ్చారు. హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. అన్ని విభాగాల విద్యార్థులతో క్యాంపస్ కొత్త కళ సంతరించుకుంది. పీజీ అడ్మిషన్ల రెండో దఫా, మూడో దఫా అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగుతోంది. మొదటి దఫాలోనే క్యాంపస్ కళాశాలలో దాదాపుగా సీట్లన్నీ నిండినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఎంజీఎం సూపరింటెండెంట్‌పై వేటు?

- వరుస సంఘటనలపై ఆరోగ్య శాఖ మంత్రి సీరియస్

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయినట్లు తెలిసింది. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శిని శనివారం ఆదేశించిన ట్లు తెలిసింది. అదేవిధంగా ప్రతీవారం ఎంజీఎంపై సమీక్ష నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఎంజీఎం ఘటనలపై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. ఎంజీఎంలో మంచం ఎక్కిన పాలన, ఎంజీఎంలో గాడితప్పిన పాలన, శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం లాంటి కథనాలు ప్రచురితం అయ్యాయి. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని ఆదేశించినట్లుగా తెలిసింది. అదేవిధంగా పలువురు ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేఎంసీలో ఉత్కర్ష-2025 ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, తదితరులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక కళాశాల ఉత్సవం ఉత్కర్ష-2025 శనివారం ప్రారంభమైంది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డాక్టర్ శ్రీధర్ కస్తూరి (1980 బ్యాచ్ అలుమిని), సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ.. ఉత్కర్ష ప్రతీ సంవత్సరం విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనకు, సామాజిక బాధ్యతాభావం పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక, క్రీడా, సామాజిక కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మధుబాబు, డాక్టర్ ఫుల్లయ్య, డాక్టర్ రమేశ్, డాక్టర్ గౌతమ్, వైద్య విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లాలో ఐఆర్‌సీఎస్ సేవలు భేష్

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ



మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) సొసైటీ జిల్లాలో ప్రజలకు విలువైన సేవలు అందించిందని, వారి సేవలు భేష్ అంటూ జిల్లా అదనపు కలెక్టర్, ఐఆర్‌సీఎస్ ఉపాధ్యక్షుడు లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ భవనంలో శనివారం ఐఆర్‌సీఎస్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా చైర్మన్ పీవీ.ప్రసాద్ గత మూడు సంవత్సరాల నుంచి చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర సంస్థ జిల్లాకు అందించిన సహకారం గురించి తెలిపారు. జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ మూడు సంవత్సరాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ జిల్లా కార్యనిర్వహక కమిటీ పదవీకాలం ముగిసినందున కొత్త కమిటీ కోసం ఎన్నికలు త్వరలో జరుపుతామని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు లెనిన్‌వత్సల్ టొప్పొను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, డాక్టర్ సూర్యకుమారి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గొర్రె వెంకన్న, తమ్మెర విశ్వేశ్వర్ రావు, రామసహాయం వెంకట్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కట్ల వెంకన్న, వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ఇంటర్మీడియట్ కీలకం

● జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్



ఫ్రెషర్స్ డే వేడుకలో మాట్లాడుతున్న మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ఇంటర్మీడియట్ కీలకదశ అని జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్ అన్నారు. మహబూబాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఐఈవో మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశం పొందిన నాటి నుంచి అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు ఎంతో వ్యయప్రయాసాలను ఓర్చుకొని చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

కళాశాల కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం డీఐఈవో మదార్‌గౌడ్, హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్నను ఘనంగా సన్మానించారు. ప్రముఖ సైకాలజిస్టు పరికిపండ్ల అశోక్, జానపద కళాకారుడు నరేష్, అధ్యాపకులు నరేష్, రమేష్, మధు, రాజేశ్వరీ, సునిత, నాగరాజు, రామకృష్ణ సారంగం, యాకన్న, బిక్షమయ్య, రఘురాం, రాజు, రవీందర్ పాల్గొన్నారు.



కురవి నాగేంద్రస్వామి ఆలయంలోని పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



మహబూబాబాద్ మహాగాయత్రీదేవి ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



మహబూబాబాద్ మహాగాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి పర్వదిన వేడుకలను శనివారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీకమాస శుద్ధ చవితి రోజున నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకుంటారు. నాగుల చవితి పండుగను పురస్కరించుకుని మహిళలు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి, నూతన దుస్తులు ధరించి శివాలయాలు, నాగదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టల్లో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిసి పోయాయి. ఏటా శ్రావణమాసంలో నాగపంచమి రోజున, కార్తీక మాసంలో నాగులచవితి రోజున పుట్టల్లో పాలుపోస్తే సుఖసంతోషాలు, అష్టఐశ్వర్యాలు దక్కుతాయని ప్రతీతి. ఉదయం నుంచి శివాలయాలు, రామాలయాలు, వివిధ వైష్ణవ దేవాలయాలకు చేరుకున్న మహిళలు నాగదేవత పుట్టపై కుంకుమ, పసుపు, పూలు చల్లి పుట్ట వద్ద కోడిగుడ్డును పెట్టి పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణం కొత్తబజారు సిద్ధార్థకాలనీలోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, పాత బజారులోని శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయం, శిఖార్‌ఖాన్‌గడ్డలో ఉన్న శ్రీముత్యాలమ్మ తల్లి దేవాలయం, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం, ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ముత్యాలమ్మ దేవాలయం, నర్సంపేట రోడ్‌లో ఉన్న శ్రీ మహాగాయత్రీ దేవాలయాలకు చేరుకున్న మహిళలు, భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

దేవాలయాల ఆవరణలో ఉన్న నవగ్రహాలకు పూజలు చేశారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఆలయాలకు చేరుకొని నాగదేవత పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. 36వ వార్డులోని నాగేంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్‌లు కృషిచేయాలని మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారధిరెడ్డి, దేవాలయ కమిటీ బాధ్యుడు నీలం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శీలం శ్రీనివాస్, విద్యాసాగర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, శ్యాంప్రసాద్, సరోజిని, మనోహర్, పల్లవి, మాధవి, శోభ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● డోర్నకల్‌లో నాగుల చవితిని పురస్కరించుకుని మహిళలు స్థానిక రైల్వే అస్పత్రి సమీపంలోని పుట్టవద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని పుట్టపై పసుపు, కుంకుమ చల్లి పాలు పోసి పూజలు నిర్వహించారు.

● కొత్తగూడ మండలంలోని గుండం శివాలయం, గుంజేడు, కొత్తగూడెంలోని రామాలయంలో నాగుల పంచమిని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. పుట్టల్లో పూజలు నిర్వహించి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

● ఇనుగుర్తిలో ఉమారామలింగేశ్వరస్వామి, గుట్టమీద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో మహిళలు పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

● మరిపెడ మునిసిపల్ కేంద్రంలో మహిళలు రామాలయం, శివాలయంలోని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపి పుట్టలో పాలు పోశారు.

● కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి ఉప ఆలయంగా ఉన్న శ్రీనాగేంద్రస్వామి ఆలయంలోని పుట్టలో మహిళలు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ అధికారులు మహిళా భక్తుల కోసం టెంట్లు వేసి, తాగునీరు ఏర్పాటు చేశారు.

● బయ్యారం మండల వ్యాప్తంగా నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. బయ్యారం రామాలయం, శివాలయం, గంధంపల్లి, ఆంజనేయస్వామి ఆలయం, కోటగడ్డ, కంబాలపల్లి శివాలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద పుట్టలో మహిళలు పాలు పోసి నైవేద్యంగా పండ్లు పెట్టారు. కాగా బయ్యారం రామాలయం, శివాలయం, కోటగడ్డ శివాలయంలోని నాగసర్పాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివలింగం చెంతకు నాగుపాము



కోటగడ్డ శివాలయంలో శివలింగం వద్ద ప్రత్యక్షమైన నాగుపాము

నాగులచవితి పర్వదినం రోజైన శనివారం కోట గడ్డ శివాలయంలో అపూరుపమైన ఘటన చోటు చేసుకుంది. శివలింగం వద్దకు నాగు పాము వచ్చి ఉండటం భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాకతీయ రాజులు పరిపాలించిన సమయంలో కోటగడ్డ గ్రామంలో శివాలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలోనే రోజువారి మాదిరిగా తెల్లవారు జామున సుమారు 5 గంటల సమయంలో పూజా రి వెంకన్న ఆలయానికి చేరుకున్నారు. శివలింగం వద్ద నాగుపాము ప్రత్యక్షమై కనిపించడంతో వెంకన్న విషయాన్ని భక్తులు, గ్రామస్థులకు తెలియపర్చాడు. నాగులచవితి రోజునే నాగు పాము శివలింగం వద్దకు చేరడంతో స్వయంగా నాగదేవతే ప్రత్యక్షమైందని భావించి భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలోని నాగసర్పాలు, పుట్ట వద్ద పాలు పోసి నైవేద్యంగా పండ్లు పెట్టారు.

అస్తవ్యస్తంగా కేజీబీవీ నిర్వహణ

● అపరిశుభ్ర వంటగది, కుళ్లిన కూరగాయలు

● ప్రత్యేకాధికారిపై చర్యలకు జీసీడీవో నివేదిక



కేజీబీవీని తనిఖీ చేస్తున్న జీసీడీవో విజయకుమారి

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం మహమూద్‌పట్నంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారి(జీసీడీవో) విజయకుమారి అన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఈ హాస్టల్‌ను శుక్రవారం సందర్శించి పలు సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫోన్లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జీసీడీవో శనివారం హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్‌లో ప్రత్యేకాధికారి సక్రమంగా విధులకు హాజరుకాకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వంటగది అపరిశుభ్రంగా, కుళ్లిన కూరగాయలతో ఉందని, వంట మనిషి పని వదిలేసి సొంతపనిపై బయటకు వెళ్లిపోయిందని తెలిపారు. స్టోర్ రూం సరిగా లేదని, స్టాక్ రిజిష్టరు కూడా లేదని, వంటకు సంబంధించిన పర్యవేక్షణ కోసం ఉపాధ్యాయుల్లో ఒకరిని నియమించాలని అలా ఇవ్వకుండా ఎస్‌వో మెస్ ఇన్‌చార్జీని తన వద్దే పెట్టుకొని ఎవరికీ ఇవ్వకుండా స్టోర్ రూం తాళాలు కూడా తన వద్దే పెట్టుకుందని తెలిపారు. ఆరు బాత్‌రూంలు సరిగా పనిచేయడంలేదని, నాన్‌టీచింగ్ సిబ్బంది కూడా సక్రమంగా విధులకు రావడంలేదని తెలిపారు. ఈ అంశాలపై ఉన్నతాధికారులకు ఎస్‌వోపై చర్య తీసుకునేందుకు నివేదిక పంపుతున్నట్లు ఆమె తెలిపారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తగు చర్యలు చేపట్టాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం పాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిల్లోని ఎన్‌సీడీ స్టాఫ్ నర్సులకు అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌వో రమేష్, గీత, శారద పాల్గొన్నారు.

విభేదాలకు తెర పడినట్టేనా!?

(5వ పేజీ తరువాయి)

సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై మాత్రం సురేఖ ఎలాంటి కామెంట్ చేయకపోవటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో ఉన్న విభేదాలు పరిష్కారం అయ్యాయనుకున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కీలక నేతలతో ఉన్న విభేదాలు మాత్రం అలాగే కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పరకాల, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలతో కొండా దంపతులకు విభేదాలు ఉన్నాయి. అలాగే నర్సంపేట ఎమ్మెల్యేతో మొదటి నుంచి రాజకీయ వైరం కొనసాగుతోంది. మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు ఏఐసీసీ నేతల వరకు వెళ్లింది. సీఎం, మంత్రి పొంగులేటి, ఇతరులతో విభేదాలకు ఫుల్‌స్టాప్ పడినట్లుగానే.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో ఉన్న విభేదాలకు బ్రేక్‌వేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టిసారించాలని కార్యకర్తలు కోరుతున్నారు. వీరి మధ్య విభేదాలతో ద్వితీయశ్రేణి నేతలకు పదవులు రాకుండా అడ్డుపడుతున్నాయనే భావన నెలకొంది. జనవరి 27వ తేదీన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలిని ప్రభుత్వం ప్రకటించింది. అయితే మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలతో ఇప్పటి వరకు ఆ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే రద్దు అయింది.

ఆర్థికంగా బలోపేతం కావాలి

● సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా బలోపేతం చెందితేనే సమాజంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయని మహబూబాబాద్ టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో సునీత అన్నమ్మ సత్యోపదేశ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వయం ఉపాధి కల్పన, సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో స్వశక్తిగా ఆర్థిక బలోపేతం సాధించినప్పుడే సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్‌కు ఏలింక్‌లు వచ్చినా ఓపెన్ చేయరాదన్నారు. సైబర్ మోసం జరిగినట్లు గమనిస్తేవెంటనే 1930కుకాల్ చేసిన, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

భీమునిపాదంలో మెరిసిన ఇంద్రధనస్సు



జాలువారుతున్న వాటర్‌ఫాల్స్‌లో వెల్లువిరుస్తున్న ఇంద్రధనస్సు

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ గూడూరు మండలం కొమ్ములవంచ అటవీప్రాంతంలోని భీమునిపాదం జలపాతంలో 70 ఫీట్ల ఎత్తు నుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. మంచుతెరలను తలపిస్తూ నీటిధారలు పడుతుంటే చూసే కనులకు ఎంతో హాయి.. ఆకుపచ్చని ప్రకృతిలో గల..గలపారే సెలయేరు. ఒక్కసారిగా మాయమై గుట్టల మీదు నుంచి కిందకు జాలువారుతుంటే మనస్సు పులకరిస్తుంది. ప్రకృతి చెక్కిన కొండలు.. వాటి మధ్య జలధారలు ప్రవహిస్తున్న తీరును చూసిన మది షైమరిపించి పోయి పురి విప్పిన నెమలి తీరు ఎగిరి గంతేయ్యాలనిపిస్తుంది.

ఈ రమణీయ దృశ్యాలకు నెలవుగా భీమునిపాదం విరసిల్లుతుంది. గుట్టలపై నుంచి వస్తున్న నీరు దార కిందకు దూకుతున్న సమయంలో ఇంద్రధనస్సు ఒక్కసారిగా వెల్లువిరిసింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మన్పించింది.

తైక్వాండో పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన కొత్త ఎల్లయ్య - మమత దంపతుల కుమార్తె కొత్త లావణ్య అండర్-19 తైక్వాండో 40 కేజీవ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీదేవి, కోచ్ రమేష్ శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థిని కొత్త లావణ్య తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో ఈనెల 24, 25న జరిగిన అండర్-19 తైక్వాండో 40 కేజీల విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. అక్టోబరు 15, 16న జమ్ముకాశ్మీర్‌లో జరుగు అండర్-19 తైక్వాండో 40 కేజీల విభాగంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

ఎలాంటి కోచింగ్ లేకుండానే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక అవడంపట్ల లావణ్య తల్లిదండ్రులతో పాటు కౌసల్యదేవిపల్లి గ్రామస్థులు పాటు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో సమస్యలను వింటున్న మురళీనాయక్

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు కావాలని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. కేసముద్రం రైతు వేదికలో శనివారం మండల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క శాఖలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ వారి వివరాలు అప్‌లోడ్ చేయకుండా నిలిపివేసిన విషయాన్ని డీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ముగ్గుపోయకముందే నిబంధనలను చూసుకోవాలని నిర్మాణంలో ఉండగా నిబంధనల పేరుతో ఇంటి నిర్మాణాలను ఫొటోలు తీయకుండా కావాలని డబ్బుల కోసం జాప్యం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే అన్నారు.

ఏఈపై మండిపాటు..

ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ పనితీరుపై మండిపడ్డారు. ఇంటికన్నెలో పెద్ద ఇంకుడుగుంతను కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా బీఆర్‌ఎస్ వారికి ఎలా కేటాయిస్తావని ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'తాటతీస్తా..' అన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి మంజూరైన పది రోడ్లు వెనుకకు వెళ్లాయని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం..

అంతకుముందు ఎమ్మెల్యే మురళీనాయక్ కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని ధన్నసరి సొసైటీ నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. చైర్మన్ గంట సంజీవరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం శ్యాంకుమార్, అసిస్టెంట్ రిజిష్టార్ ఎం.ప్రవీణ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ అజయ్, ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, సీఈవో గోపాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి సహకరించాలి

● ఇనుగుర్తి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు అన్ని శాఖల అధికారులు సహకరించాలనిఎమ్మెల్యే మురళీనాయక్ సూచించారు. ఇనుగుర్తి రైతు వేదికలో మండల అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి అవసరమైన మట్టిని అందించేందుకు సహకరించాలని, ఇళ్లపైనున్న విద్యుత్ వైర్లను పక్కకు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, దిశ సభ్యుడు గుజ్జునూరి బాబురావు, తహసీల్దార్ తరంగిణి, ఎంపీడీవో పార్థసారథి, ఏవో ప్రభాకర్, ఎస్ఐ కరుణాకర్, ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము పాల్గొన్నారు.



మర్రిగూడెంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు

గంగారం మండల అభివృద్ధికి నిధులు మంజూరు

● మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గంగారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలంలో పలు అభివృద్ధి పనులకు 50 కోట్ల రూపాయల నిధులను పంచాయతీ రాజ్ శాఖమంత్రి ధనసరి సీతక్క మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలిపారు. గంగారం నుంచి కామారం వరకు డబుల్ రోడ్డు (వతెనలతో పాటు) నిర్మాణానికి రూ.20, చింతగూడెం నుంచి మహదేవునిగూడెం వరకు బీటీ రోడ్డుకు రూ.రెండు కోట్లు, కోమట్లగూడెం వంతెనకు రూ.3 కోట్ల 50లక్షల రూపాయలు, మర్రిగూడెం పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి రూ.6కోట్లు, స్థానిక కులదేవతల గుడుల నిర్మాణానికి రూ.50లక్షలు, ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా సీసీ రోడ్లుకు, డ్రైనేజీలకు రూ.2కోట్లు, పైపులైను నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయటమే కాకుండా కోమట్లగూడెంలో సబ్‌స్టేషన్ నిర్మాణం, నాలుగు నూతన అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కామారం నుంచి దుబ్బగూడెం రహదారికి అటవీ అనుమతులతో పాటు మండలంలో వెయ్యి మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయటమే కాకుండా ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి రహదారులకు రూ.70లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సువర్ణపాక జగ్గారావు, ముడిగ పోతయ్య, గుండగాని శ్రీధర్, గిరిగాని ప్రవీణ్ పాల్గొన్నారు.

రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరి అరెస్ట్

ఇనుగుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలోలో మారపాక జ్యోతిపై హత్యాయత్నం కేసులో ఆమె భర్త మారపాక జగన్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జి.కరుణాకర్ తెలిపారు. ఈనెల 16న రాత్రి పుస్తెలతాడుతో జ్యోతి మెడకు ఉరిబిగించి చంపేందుకు జగన్ ప్రయత్నించగా ఆమె తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కరుణాకర్ తెలిపారు.

దాడి కేసులో ఒకరు..

ఇనుగుర్తి మండల కేంద్రంలో భూతగాదాలో సామల వెంకన్న అతని కుమారునిపై ఈనెల 2న దాడి చేసిన కేసులో ఇదే గ్రామానికి చెందిన సామల యాకన్నను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో వెంకన్న కుమారుని చేయి విరిగిందని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.